భౌతిక దాడులకు బెదిరేది లేదు



- ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-దుబ్బాక: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకులపై ఏబీవీపీ దాడి చేయడం పట్ల ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం దుబ్బాక మండల పరిధిలోని రఘోత్తంపల్లిలో ఎస్ఎఫ్ఐ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ గ్రామ కమిటీ అధ్యక్షులు కార్యదర్శి రాజు, భాను మాట్లాడుతూ ఏబీవీపీ ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తుందన్నారు. దేశంలో అందరికీ విద్యా అందరికీ ఉపాధి కావాలని ఎస్ఎఫ్ఐ ఉద్యమిస్తే, ఏబీవీపీ కులం, మతం పేరుతో విద్యార్థుల మధ్య చిచ్చు రేపుతుందన్నారు. ఎన్ని భౌతిక దాడులు చేసినా ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమాన్ని ఆపలేరని నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.రాజ్యాంగాన్ని రక్షించండి అనే నినాదంతో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. దేశంలో అన్ని యూనివర్సిటిలో ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల్లో గెలుపొందడాన్ని ఓర్వలేక ఏబీవీపీ గుండాలు ప్రతిసారి ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి చేయడం సరికాదన్నారు. ఏబీవీపీకి విద్యారంగంపైన చిత్తశుద్ధి ఉంటే నూతన విద్యా విధానంపై చర్చ జరిపి రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అభిషేక్, మణిదీప్, పాల్గొన్నారు.

గాలికి బిఫామ్ అందించిన కేటీఆర్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌కు గురువారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల శాసనసభ్యులు కేటీఆర్ బి ఫాం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మాజీ అసెంబ్లీ స్పీకర్, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి, జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావు, ఆందోల్ మాజీ శాసనసభ్యులు క్రాంతికుమార్, జుక్కల్ మాజీ శాసనసభ్యులు హనుమంతు షిండే, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి, ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు నల్లమడుగు సురేందర్, కామారెడ్డి మాజీ శాసనసభ్యులు గంప గోవర్ధన్, సంగారెడ్డి జిల్లా పరిషత్ ఛైర్మన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, నిజామాబాద్ కామారెడ్డి జడ్పీ ఛైర్‌పర్సన్ శోభ రాజు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంస్ ఛైర్మన్ మల్కాపురం శివకుమార్, పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జి దేవి ప్రసాద్, ఉమ్మడి జిల్లాలో మాజీ జడ్పీ ఛైర్మన్, బాన్సువాడ నియోజకవర్గ సమన్వాయకర్త దఫేదార్ రాజు, కామారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు ముజుబుద్దిన్, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, మశ్చందర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వాహనం తనిఖీ



నవతెలంగాణ-నర్సాపూర్

పార్లమెంట్ ఎన్నికలో భాగంగా గురువారం నర్సాపూర్ పోలీసులు పట్టణ సమీపంలోని హైదరాబాద్ వెళ్లే మార్గంలో మల్లన్న దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. అయితే హైదరాబాద్ వైపు నుంచి మెదక్ వైపు వెళ్తున్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వాహనాన్ని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. అదేవిధంగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ వాహనాన్ని సైతం తనిఖీ చేశారు.

డిప్యూటీ తహశీల్దార్ చంప చెల్లుమనిపించిన మహిళ



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణంలోని సత్య సాయి కాలనీలో సాయి అనే వ్యక్తి ఇంట్లో నివాసముంటున్న ఎలక్షన్స్ డిప్యూటీ తహసిల్దార్ రాజు అసభ్యకరంగా వ్యవహరిస్తున్నాడని ఓ మహిళ చెంప చెల్లుమనిపించిన ఘటన బుధవారం రాత్రి 7 గంటల 15 నిమిషాలకు చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ట్రైబల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్ భార్యను అదే భవనంలో అద్దెకు ఉంటున్న ఎలక్షన్స్ డిప్యూటీ తహసిల్దార్ రాజు గత కొంతకాలంగా మానసికంగా అసభ్యకరంగా వేధింపులకు గురి చేస్తున్నాడు. అనవసరంగా మాట్లాడుతూ లైంగిక పరమైన సైగలు చేస్తూ, ఫోన్లో ఫోటోలు వీడియోలు తీస్తున్నాడని బాధిత మహిళ ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బట్టలు ఆరబెట్టేందుకు వచ్చిన మహిళను డిప్యూటీ తహసిల్దార్ రాజు ఫోన్లో ఫోటోలు వీడియోలు తీస్తున్నాడనే అనుమానంతో బాధిత మహిళ చెంప చెల్లుమనిపించింది. ఈ మేరకు వేధింపులకు గురి చేస్తున్నాడన్న విషయాన్ని భర్త విజయ్ కుమార్‌కు తెలియచేయడంతో నారాయణఖేడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా డిప్యూటీ తహసిల్దార్ రాజు మాట్లాడుతూ తనపై అనవసరంగా మహిళ దాడి చేసిందని పరువు నష్టం దావా వేస్తానని తెలిపారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ మున్సిపాలిటీలు, పలు గ్రామాలకు చెందిన చెందిన బీఆర్ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పటాన్‌చెరులో నిర్వహించిన అసెంబ్లీ నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. మైనంపల్లి హనుమంతరావు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్, పటాన్‌చెరు నియోజకవర్గ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్‌లు పార్టీ కండువాలు కప్పి సాదరంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు.

హార్వెస్టర్‌పై నుంచి పడి డ్రైవర్ మృతి



నవతెలంగాణ-పాపన్నపేట

ఆగి ఉన్న హార్వెస్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గాంధారిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పంజాబ్ రాష్ట్రానికి చెందిన సుర్జిత్ సింగ్ (49) గత మూడు నెలల నుంచి నిజామాబాద్ జిల్లాలోని ఓ వ్యక్తి వద్ద హార్వెస్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గాంధారిపల్లికి యంత్రాన్ని తీసుకొని వచ్చి గ్రామ శివారులో బుధవారం సాయంత్రం పంటను కోసి రాత్రి సమయంలో భోజనం చేయడానికి వరికోత యంత్రంపైకి ఎక్కి పైన కూర్చొని భోజనం చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడే ఉన్న యంత్రం హెల్పర్ సజన్ స్థానికులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. సహాయకుడు సజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై అవగాహన

నవతెలంగాణ- దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని ఐటీసీ కార్యాలయంలో గురువారం వృద్ధులు, వికలాంగులకు పోస్టల్ బ్యాలెట్ వినియోగంపై అధికారులు సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లా సహాయ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అధ్యక్షతన నిర్వహించిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సమావేశంలో ఎన్నికల సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో దుబ్బాక, మిరుదొ రెడ్డి, అక్బరుపేట భూంపల్లి, మాసాయిపేట, తొగుట మండల తహసీల్దారులు నల్ల వెంకట్ రెడ్డి, గోవర్ధన్, జయంత్, జ్ఞాన జ్యోతి, శ్రీకాంత్, పలువురు ఎన్నికల సిబ్బంది, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

గ్రామాలలో తాగునీటి సమస్యల్లేకుండా చూడాలి




- డిపిఓ దేవకి దేవి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ అక్కన్నపేట మండలాలలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని సిద్దిపేట డిపిఓ దేవకీదేవి అన్నారు. గురువారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో హుస్నాబాద్ అక్కన్నపేట మండలాల అధికారులతో తాగునీటిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఓ దేవకి దేవి మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో నీటి సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ప్రత్యేక అధికారులు తాగునీటితో పాటు ఇతర సమస్య లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సరోజన, డీఈలు, డిఎల్‌పిఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీవోలు వేణుగోపాల్ రెడ్డి, ఎంపీ ఓ సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేత



నవతెలంగాణ -దుబ్బాక

విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకుగాను తనవంతు సహకారంగా వాలీబాల్ క్రీడా సామాగ్రిని అందజేయడం జరిగిందని పీఈటీ వీ.నరేష్ చెప్పారు. గురువారం దుబ్బాక పురపాలిక పరిధిలోని ధర్మాజీపేట జడ్పిహెచ్ఎస్ విద్యార్థులకు ఈ క్రీడా సామాగ్రిని అందజేశారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పీఈటీ నరేష్‌ను పలువురు అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం, పలువురున్నారు.

తొలి రోజు ఐదు నామినేషన్లు

- మెదక్‌లో నాలుగు..జహీరాబాద్‌లో ఒకటి
- సంగారెడ్డి, మెదక్ కలెక్టరేట్లో మూడంచెల భద్రత
- 100 మీటర్ల దూరంలోనే నిలిపివేత
- అభ్యర్థి సహా మరో నలుగురికే ఆర్ఓ చాంబర్‌కు అనుమతి
- మెదక్‌లో నామినేషన్ వేసిన రఘునందన్‌రావు
- నీలం మధు తరపున నామినేషన్ వేసిన ఎమ్మెల్యే రోహిత్‌రావు
- కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షేట్కర్ తరపున నామినేషన్ వేసిన కాంగ్రెస్ నాయకులు
- తెలంగాణ ప్రజాశక్తి పార్టీ నుంచి దొడ్ల వెంకటేశం
- స్వతంత్ర అభ్యర్థిగా చిక్కుపల్లి నవీన్ నామినేషన్ దాఖలు







నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో తొలి రోజు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో నలుగురు నామినేషన్లు వేయగా జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక్కరే నామినేషన్ వేశారు. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేశారు. మెదక్, సంగారెడ్డి కలెక్టరేట్లలో నామినేషన్లు స్వీకరించారు. రెండు చోట్ల కూడా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కలెక్టరేట్లకు ఎవర్నీ అనుమతించలేదు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో నలుగుర్ని మాత్రమే ఆర్ఓ చాంబర్లకు అనుమతించారు. పోలీసులు మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులతో పాటు గుర్తింపు లేని రాజకీయ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్లు వేశారు.

మూడంచెల భద్రత

పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ గురువారం జారీ అయ్యింది. అదే రోజు నుంచి అభ్యర్థులు తమ నామినేషన్లు కూడా దాఖలు చేశారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఉన్నారు. మెదక్ కలెక్టరేట్‌లో అభ్యర్థులు నుంచి నామినేషన్లను ఈఆర్ఓ చాంబర్‌లో స్వీకరించారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు ఉన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో నామినేషన్లను స్వీకరిస్తున్నారు. మెదక్, సంగారెడ్డి రెండు కలెక్టరేట్లలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియలు జరగనున్నందున మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల అభ్యర్థులు, గుర్తింపు పొందని రాజకీయ పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు ఆర్ఓ చాంబర్‌కు వెళ్లేందుకు ఐదుగుర్ని మాత్రమే అనుమతిస్తున్నారు. నామినేషన్ సెంటర్ల వెళ్లేందుకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎవర్నీ పోలీసులు అనుమతించట్లేదు. అభ్యర్థితో పాటు మరో నలుగుర్ని మాత్రమే ఆర్ఓ చాంబర్‌కు పంపుతున్నారు. నామినేషన్ దాఖలు చేస్తున్న సమయంలో ఫొటోలు, వీడియోలను ఎన్నికల సిబ్బందే తీస్తున్నందున మీడియాకు కూడా అనుమతి ఇవ్వట్లేదు. నామినేషన్ సెంటర్ల వద్ద మీడియా పాయింట్‌ను ఏర్పాటు చేశారు. మెదక్, సంగారెడ్డి కలెక్టరేట్ల వద్ద 100 మీటర్ల దూరంలోనే అందర్నీ నిలిపేస్తున్నారు. లోపలికి వెళ్లేందుకు అనుమతి పొందిన వాళ్లను క్షుణంగా తనిఖీ చేసి పంపుతున్నారు. కలెక్టరేట్ సముదాయంలోని ఇతర ప్రభుత్వ శాఖల్లో వివిధ పనుల కోసం వచ్చే వాళ్లను 3 గంటల తర్వాతనే అనుమతిస్తున్నారు. రోడ్‌షోలు, ర్యాలీలు, సభల్ని ఎన్నికల వ్యయ విభాగం, వెబ్‌కాస్టింగ్ సిబ్బంది ఫొటో, ఆడియో, వీడియో చిత్రీకరణ చేస్తున్నారు.

నీలం మధు తరపు ఎమ్మెల్యే రోహిత్‌రావు నామినేషన్ దాఖలు

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్‌ను ఆయన తరపున మెదక్ కాంగ్రెస్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు దాఖలు చేశారు. మెదక్ పట్టణంలోని దత్తాత్రేయుని దేవాలయంలో పూజలు చేసిన అనంతరం మెదక్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. నీలం మధు తరపున నామినేషన్ దాఖలు చేసిన వారిలో నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు అంజనేయులు గౌడ్, మెదక్ మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్ ఉన్నారు. ఈ నెల 20న నీలం మధు స్వయంగా వచ్చి మెదక్‌లో తన నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. నీలం మధు నామినేషన్ వేసే కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి కూడా హాజరుకానున్నారు. భారీ ఎత్తున జన సమీకరణ చేసి బలప్రదర్శన చేయనున్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జీ మంత్రి కొండ సురేఖ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలు, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. మెదక్ పట్టణం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ఎత్తున రోడ్ షో నిర్వహించనున్నారు.

బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు నామినేషన్ దాఖలు

మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు కూడా గురువారం తన నామినేషన్‌ను దాఖలు చేశారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ చాంబర్‌లో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు తన నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం పార్టీ ఆధ్వర్యంలో భారీ సభ నిర్వహించారు. ఈ సభకు గోవా ముఖ్యమంత్రి ప్రమోద్‌సావంత్ హాజరయ్యారు.

మరో ఇద్దరు నామినేషన్

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్, బీజేపీతో పాటు మరో ఇద్దరు అభ్యర్థులు కూడా నామినేషన్ వేశారు. తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అభ్యర్థిగా దొడ్ల వెంకటేశం నామినేషన్‌ను పార్టీ ప్రతినిధులు దాఖలు చేశారు. అదే విధంగా స్వతంత్ర అభ్యర్థిగా బిక్కుపల్లి నవీన్‌కుమార్ నామినేషన్‌ను ఆయన అనుచరులు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

జహీరాబాద్ నుంచి సురేష్ షేట్కర్ నామినేషన్ దాఖలు

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గురువారం కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌కుమర్ షేట్కర్ నామినేషన్‌ను ఆయన తరపున కాంగ్రెస్ పార్టీ నాయకులు దాఖలు చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో జహీరాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరుకు నామినేషన్ పత్రాలను అందజేశారు.

జూట మాటలతో బీజేపీ..మాయ మాటలతో కాంగ్రెస్ మట్టికొట్టింది

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే హరీశ్ రావు
- రైతుల ఉసురుపోసుకుంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం
- అత్యంత -ప్రమాధకరమైన పార్టీ బీజేపీ..
- ప్రశ్నించే గొంతుకను పార్లమెంట్ కు పంపించాలని విజ్ఞప్తి
- ఇథనాల్ పరిశ్రమ రద్దుకు అండగా ఉంటానని హామీ





నవతెలంగాణ-బెజ్జంకి

దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు అభివృద్ధి చేయలేని జూట మాటల బీజేపీ..మాయ మాటలతో రైతుల ఉసురుపోసుకుంటూ ప్రజల నోట్లో మట్టికొట్టిని కాంగ్రెస్ పార్టీలకు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినిపల్లి వినోద్ కుమార్ ఎన్నికల ప్రచారానికి హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరవ్వగా మండల బీఆర్ఎస్ శ్రేణులు ఒగ్గడోలు, డప్పు చప్పుల్లతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బస్టాండ్ అవరణం వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సభలో హరీశ్ రావు మాట్లాడారు. అబద్దాల హామీలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గద్దెనెక్కిందని..నాలుగు నెలల పాలనలో రైతులకు సాగు, ప్రజలకు తాగు నీరు కరువైందన్నారు. ఎన్నో ఒడిదోడుకులను ఒర్చుకుని రైతులు సాగుచేసిన పంట దిగుబడులను కల్లాల్లో విక్రయించుకునే దుస్థితి దాపురించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మళ్లీ ఓట్లడగుతున్న కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. అత్యంత ప్రమాదకరమైన పార్టీ బీజేపీ పార్టీయేనని.. వారు చేసిన అభివృద్ధి పనుల్లేకా, చెప్పుకోల్లేని పథకాల్లేకా ఓట్లకోసం చిత్ర పటాలు పంచుతున్నారని.. తెలంగాణ రాష్ట్రం పక్షాన వినోద్ కుమార్‌ను పార్లమెంట్‌కు పంపితే కాంగ్రెసోడు భూమ్మిదకు వస్తాడని సూచించారు. గుగ్గిళ్ల, పోతారం శివారుల్లో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని అయా గ్రామాల ప్రజలు చేస్తున్న పోరాటానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మీద కోపంతో బీజేపీకి ఓటేస్తే అసలుకే మోసం వస్తుందని బీఆర్ఎస్ అభ్యర్థి కారు గుర్తుకు ఓటేసి బోయినిపల్లి వినోద్ కుమార్ గెలుపులో బెజ్జంకి మండల ప్రజలు తమ సత్తా చాటాలని ప్రజలను అభ్యర్థించారు.

అబద్దాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన అబద్దాల పునాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, హామీలిచ్చి మోసం కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినిపల్లి వినోద్ కుమార్ ప్రజలకు సూచించారు. రాష్ట్రానికి ప్రధానిగా మోడీ, రాష్ట్రానికి, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థి బండి సజయ్ చేసిన అభివృద్ధేమి లేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర గొంతుకగా పార్లమెంట్ యందు ఉండేలా ఓట్లు వేసి ఎంపీగా గెలిపించాలని బోయినిపల్లి వినోద్ కుమార్ అభ్యర్థించారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ఎంపీపీ నిర్మల, టీఎస్ స్కాబ్ ఛైర్మన్ కొండూరి రవీందర్ రావు, జిల్లాధ్యక్షుడు జీవీ రామక్రిష్ణ, మండల బీఆర్ఎస్ నాయకులు, అయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

సైనిక్ స్కూల్ కి పర్మిషన్ లేదు

- సీబీఎస్ఈ అని విద్యార్థులకు ఎర
- తిరుపతిలోని స్కూల్ పేరు చెప్పి ములుగులో బిజినెస్

నవతెలంగాణ-ములుగు

స్టేట్ పర్మిషన్ కూడా లేకుండా సీబీఎస్ఈ అని విద్యార్థులను మోసం చేస్తున్న మరో స్కూల్ సైనిక్ స్కూల్ బాగోతం బయటపడింది. వివరాలు ఇలా ఉన్నాయి . మండలాపరిధిలోని లక్ష్మక్కపల్లి లో వెరిటాస్ సైనిక్ స్కూల్ ను స్థాపించారు. అయితే ఈ స్కూల్‌కు పర్మిషన్ లేదని తెలిసింది. అయినా కూడా అడ్మిషన్స్ ఓపెన్ చేసి..మేము మీ పిల్లలను ప్రపంచానికి పరిచయం చేస్తాము. మీ పిల్లల్లో ఉన్న టాలెంట్‌ను బయటకు తీస్తాము అంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది.. వీరు ఆంధ్రప్రదేశ్ తిరుపతిలో స్కూలు నడిపిస్తున్నారు. అక్కడి స్కూల్ బిల్డింగ్ ఫోటోలు అక్కడి స్కూల్ కోడును ఉపయోగించి ఇక్కడ పిల్లల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారు. ఈ స్కూలుకు పర్మిషన్ ఉందా నిజంగానే సీబీఎస్సీ సిలబస్ ఉందా అని వారికి ఫోన్ చేయగా వారు నిజంగానే సీబీఎస్సీ స్కూల్ అని పిల్లల తల్లిదండ్రులకు చెప్తున్నారు. ఫీజు వివరాలు అడిగితే స్కూలుకు వెళ్తేనే కానీ ఫీజు వివరాలు తెలపమంటున్నారు. మండల పరిధిలో పదుల సంఖ్యలో ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి కానీ ఇప్పటివరకు ఏ ఒక్క స్కూలుకు కూడా సీబీఎస్సీ పర్మిషన్ లేదు. సీబీఎస్ఈ పర్మిషన్ లేనప్పుడు ఎక్కువ ఫీజులు ఎందుకు తీసుకుంటున్నారన్నది ప్రశ్న. ఇంత జరుగుతున్నా దీనిపై మండల విద్యాధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి.

విద్యార్థులను మోసం చేస్తున్న కొత్త ప్రైవేట్ పాఠశాలలు



విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు మంచి పాఠశాలలో చదవాలి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలి అనే ఆలోచన ప్రతి ఒక్క తల్లిదండ్రులలో ఉంటుంది. దీనిని ఆసరా చేసుకుని పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కొత్త ప్రైవేటు పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులకు ఎరవేస్తున్నాయి.

నిర్మాణంలో ఉన్న సైనిక్ స్కూల్

ఈ స్కూల్‌కి పర్మిషన్ లేకపోగా పాఠశాల బిల్డింగు నిర్మాణంలో ఉన్నది. నిర్మాణంలో ఉన్న బిల్డింగులో కార్యకలాపాలు జరుపకూడదు. అయినా కూడా ఇక్కడ అడ్మిషన్స్ పేరు చెప్పి కార్యకలాపాలు జరుపుతూ విద్యార్థులు తల్లిదండ్రులను మోసం చేస్తున్నట్టు తెలిసింది.

సైనిక్ స్కూల్‌కు పర్మిషన్ లేదు



మండల విద్యాధికారి ఉదయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ సైనిక్ స్కూల్‌కు ఇప్పటివరకు ఎలాంటి పర్మిషన్ లేదని, తిరుపతిలో ఉన్న స్కూల్ పాంప్లెంట్లను, బ్రోచర్స్ చూపెట్టి ఇక్కడ అడ్మిషన్లు తీసుకోరాదన్నారు. వేరే రాష్ట్రం లో ఉన్న స్కూలును చూపించి ఇక్కడ అడ్మిషన్లు తీసుకోరాదన్నారు. సీబీఎస్ఈ సిలబస్ పర్మిషన్ కూడా లేదని ఇప్పటివరకు స్టేట్‌లో కూడా రిజిస్ట్రేషన్ కాలేదని ఆయన 'నవతెలంగాణ'తో తెలిపారు. ఒకవేళ రూల్స్ పాటించకుండా సీబీఎస్సీ పేరు చెప్పి అడ్మిషన్స్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



మండల విద్యాధికారి ఉదయ భాస్కర్ రెడ్డి

ప్రజలను మభ్యపెట్టిండ్రు..ఆ ప్రజలే బొంద పెట్టిండ్రు

- బీఆర్ఎస్ సర్కారు వోస్తే...జాగ భూమి మిగిలేది కాదు
- కార్యకర్తల సమావేశంలో మైనంపల్లి, జగ్గారెడ్డి, నీలం మధు, కాటా శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-పటాన్ చెరు: బీఆర్ఎస్ సర్కారు ప్రజలను మభ్యపెట్టిండ్రు కనుకనే... వారిని అసెంబ్లీ ఎన్నికలలో బొంద పెట్టినారని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు బీఆర్ఎస్‌పై విరుచుకుపడ్డారు. ఇదిగో డబుల్ బెడ్ రూమ్... అదిగో డబుల్ బెడ్ రూమ్ అంటూ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ గత సర్కారు పాలనను కడిగి పారేశారు. పటాన్‌చెరులో కాంగ్రెస్ పార్టీకి పటిష్టమైన కార్యకర్తలు ఉండడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. బీసీలంతా ఏకమై ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించుకొని కాంగ్రెస్ పార్టీ సత్తా చూపించాలని మైనంపల్లి హనుమంతరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

నీలం మధును గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిది

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి

బడుగు బలహీన వర్గాల బిడ్డ నీలం మధును రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాల్సిన అవసరం మన అందరిపైనా ఉందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గా రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి అందరికీ తెలుసని ఆయన అభిప్రాయపడ్డారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమం

మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల్లోనే ఇచ్చిన హామీలను నెరవేర్చిందని మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ అన్నారు. అందరి దీవెనలతో ఇందిరమ్మ పోటీ చేసిన మెదక్ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం వచ్చిన తనకు ఈ ఎంపీ ఎన్నికలలో గెలిపిస్తే ప్రజా సేవ చేసి, రుణం తీర్చుకుంటానన్నారు.

మాట మీద కట్టుబడి ఉండేది కాంగ్రెస్ పార్టీ

పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కాట శ్రీనివాస్ గౌడ్

ప్రజలకు మాట ఇస్తే కట్టుబడి ఉండే పార్టీ కాంగ్రెస్ అని పటాన్ చెరు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గత సర్కారు హాయంలో ఉన్న ఎమ్మెల్యేలలో పటాన్‌చెరు ఎమ్మెల్యే ప్రధాన అవినీతిపరుడని ఆరోపించారు. ఏకంగా రూ.300 కోట్లను సర్కారుకు గండి కొట్టాడని విమర్శించారు. ప్రతి గ్రామంలో ఆయన అవినీతికి పాల్పడ్డాడని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికలలో ఎలాగైతే పనిచేశారో? ఈ పార్లమెంట్ ఎన్నికలలో కలిసికట్టుగా పనిచేసి ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో పీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, పార్లమెంట్ నియోజికవర్గ ఇంచార్జ్ శ్యామ్ గౌడ్, పీసీసీ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి, మైనార్టీ, ఎస్సీ బీసీ, మండల కాంగ్రెస్, పట్టణ కాంగ్రెస్, మున్సిపాలిటీ, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకు మహిళా నాయకురాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవతెలంగాణ 2
సంగారెడ్డి
శుక్రవారం | 19 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

గీతంకు శాస్త్రీయ ఆవిష్కరణలు ప్రోత్సహించే ప్రాజెక్టు

నవతెలంగాణ - పటాన్‌చెరు



న్యూఢిల్లీలోని శాస్త్ర, సాంకేతిక విభాగం (డీఎస్టీ)' సైన్స్ ప్రయోగాలు చేద్దాం - పాఠశాల విద్యార్థులతో శాస్త్రీయ ఆవిష్కరణలను ప్రోత్సహిద్దాం' పేరుతో బాలల కేంద్రీకృత ఔట్ రీచ్ కార్యక్రమం కోసం రూ.25.79 లక్షలను కేటాయించింది. ఈ విషయాన్ని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ దయానంద సిద్ధవట్టం గురువారం విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు.గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని భౌతిక శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ స్పందన బగ్గం ప్రధాన పరిశోధకురాలిగా పనిచేస్తారని తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ వీనీ కనంక లక్ష్మి, డాక్టర్ కె.ఆదర్శకుమార్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ కె.నవీన్ కుమార్, భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ సి. కనకరాజు ఈ ప్రాజెక్టుకు సహ పరిశోధకులుగా వ్యవహరిస్తారని వీసీ వివరించారు. డాక్టర్ స్పందన, ఇతర సహ పరిశోధకులను అభినందించి, దానిని నిర్ధారిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

108 వాహనంలో ప్రసవం

తల్లిబిడ్డ క్షేమం , 108 సిబ్బందికి ప్రశంసలు
నవతెలంగాణ -జోగిపేట



108 వాహనంలో ఓ మహిళ ప్రసవం కావడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. గురువారం మధ్యాహ్నాం హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన మంజుల అనే మహిళ పురిటి నొప్పులతో బాధపడుతూ 108 వాహనానికి సమాచారం అందించారు. వెంటనే వాహనం గ్రామానికి వెళ్లి మంజులను డెలివరీ నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు వాహనంలో తీసుకువస్తున్నారు. మార్గమధ్యమంలోకి రాగానే నొప్పులు ఎక్కువ కావడంతో వాహనంలోనే సిబ్బంది డెలివరీ చేశారు. దీంతో ఆడబిడ్డ జన్మించింది. తల్లి బిడ్డలను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 108 వాహనం ఈ ఆర్ సి పి డాక్టర్ హబీబ్, ఈఎంటి ఎం శ్రీనివాస్, పైలట్ కృష్ణమూర్తిలను కుటుంబ సభ్యులు అభినందించారు. సకాలంలో వైద్యం చేయడంతో తల్లిబిడ్డలకు ప్రాణాపాయం తప్పిందని 108 సిబ్బంది తెలిపారు.

19న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఖిజర్ యాఫై ఆధ్వర్యంలో ఈద్ మిలాప్

నవతెలంగాణ - జహీరాబాద్



ఈ నెల 19న సాయంత్రం 6 గంటలకు బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ ఖిజర్ యాఫై ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రివర్యులు, సిద్ధిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్, స్థానిక శాసనసభ్యులు కొనింటి మాణిక్‌రావు, పార్లమెంట్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ లు హాజరవుతున్నారు. సాయంత్రం 6 గంటలకు ఖిజర్ యాఫాయి కార్యాలయం జరిగే కార్యాక్రమానికి నియోజకవర్గంలోని బిఆర్ఎస్ పార్టీ కుటుంబసభ్యులు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్ లు, మాజీ కౌన్సిల్లర్ లు, మాజీ మార్కెట్ ఛైర్మన్ లు , డైరెక్టర్ లు, మాజీ ఆత్మ ఛైర్మన్‌లు , డైరెక్టర్‌లు, రైతు సమన్వయ సమితి కో ఆర్డినేటర్లు, మండల పార్టీ అనుబంధ సంఘాల యువత, మహిళా, మైనారిటీ, ఎస్సి, ఎస్టీ, బి సి, కార్మిక, విద్యార్థి, సోషల్ మీడియా అధ్యక్షులు, కమిటీ సభ్యులు, మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, మాజీ ఉప సర్పంచ్ లు, ఛైర్మన్ లు మెంబెర్ లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్య లో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పటాన్‌చెరు నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ -ఐడిఏ బొల్లారం



ఎస్.వి.ఆర్ గార్డెన్‌లో మెదక్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన పటాన్ చెరు నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యుడు మైనంపల్లి హనుమంతరావు హాజరయ్యారు.. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వి.చంద్రారెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలపై అవగాహన

నవతెలంగాణ -జోగిపేట



అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక సాయి కృష్ణ పెట్రోల్ బంకులో జోగిపేట ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెట్రోల్ బంకుల్లో అగ్ని ప్రమాదాలను ఎలా నివారించవచ్చో వారికి వివరించారు. ఈనెల 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అగ్ని మాపక వారోత్సవాలకు సంబంధించిన కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది గణేష్, రామకష్ణ, సత్యనారాయణ, అర్జున్, దిలీప్, పెట్రోల్ బంక్ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ వై.నరోత్తం

నవతెలంగాణ జహీరాబాద్



జహీరాబాద్ నియోజకవర్గంలో జరిగిన పలు వివాహ వేడుకల్లో మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం ఝరాసంఘం మండల కేంద్రంలోని రాగోజి కళ్యాణమండపంలో జరిగిన నాగేష్ పాటిల్ సోదరుని వివాహానికి, జహీరాబాద్ మండలం రాయిపల్లి.డి గ్రామంలో జరిగిన ఏ.నర్సింలు కుమారుని వివాహానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వివాహ వేడుకల్లో మాజీ సర్పంచ్ లు శంకర్,విజయ కుమార్, నాయకులు మాణిక్ ప్రభు గౌడ్,నబిసాబ్,మోహన్, చెంగల్ జైపాల్,తదితరులు పాల్గొన్నారు.

వివాహ విందుకు ఆహ్వానించిన మాజీ పట్టణ అధ్యక్షులు

నవతెలంగాణ - జహీరాబాద్



జహీరాబాద్ టీఆర్ఎస్ మాజీ పట్టణ అధ్యక్షులు మహమ్మద్ యాకూబ్ కుమారుడు డాక్టర్ ఫర్హాద్ వివాహానికి హాజరవ్వాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావును ఆహ్వానించినట్లు యాకూబ్ తెలిపారు. గురువారం హరీశ్‌రావును కలిసి కుటుంబ సమేతంగా వివాహానికి హాజరుకావాలని ఆహ్వానించారు. ఫరహాద్ విద్యను అభ్యసించేందుకు హరీశ్‌రావు అన్ని విధాలుగా సహకరించారని తెలిపారు. ఎమ్మెల్యే మాణిక్యరావు, ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ లకు కూడా ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నామ రవి కిరణ్ నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మెదక్ తరలిన బీజేపీ శ్రేణులు



నవతెలంగాణ - జిన్నారం

మెదక్ పార్లమెంటరీ బిజెపి అభ్యర్థిగా మాధవనేని రఘునందన్ రావు నామినేషన్ కార్యక్రమానికి మద్దతుగా గురువారం జిన్నారం మండల బిజెపి శ్రేణులు మెదక్‌కు తరలి వెళ్లాయి. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కురుపల్లి నర్సింగరావు, ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, కొత్తకాపు జగన్ రెడ్డి, సోలక్పల్లి భాస్కర్ రెడ్డి, మద్దూరిరాజు, సుధాకర్, రమేష్, శ్రీనివాస్, ఎల్లన్న గారి వెంకటేష్ బృందం పాల్గొన్నారు

ఆటో డ్రైవర్‌ల పైన రేగోడ్ పోలీసుల వేధింపులు ఆపాలి సిఐటియు డిమాండ్



నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్ : ఆటో డ్రైవర్లను రేగోడు పోలీసుల వేధింపులు ఆపాలని సిఐటియు డివిజన్ నాయకులు కే. సతీష్ డిమాండ్ చేశారు. ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఫ్రీ బస్సు చేయడం వల్ల ఆటోలు నడవని పరిస్థితి నెలకొందని, ఆటో డ్రైవర్ల కుటుంబం పోషించుకునే పరిస్థితి లేదని, ఉదయం నుండి రాత్రి వరకు అడ్డా మీద ఆటో పెట్టుకున్న కనీసం పెట్రోల్, డీజిల్ ఎల్ల లేని పరిస్థితి ఉంటే రేగోడ్ పోలీసులు మాత్రం ఫోటోలు కొడుతూ చలాన్లు వేస్తున్నారని అన్నారు. ఫైనాన్సో చిట్టీలు కడుతున్నామని ఫ్రీ బస్సులు రావడం వల్ల ఫైనాన్సో చిట్టీలు కట్టలేని పరిస్థితి నెలకొందని అన్నారు ఆటో కార్మికులకు రేగోడు పోలీసులు వేధింపులు ఆపాలని లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పాలిసెట్‌కు 22 వరకు దరఖాస్తు చేసుకోవాలి

పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కుమారస్వామి
నవతెలంగాణ - జహీరాబాద్

ఈ నెల 22వ తేదీ లోపు పదవ తరగతి పరీక్ష రాసినటువంటి విద్యార్థిని విద్యార్థులు అందరూ పాలీసెట్ పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక సంగమేశ్వర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన పత్రిక ప్రకటనలో రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాలిటెక్నిక్లలో డిప్లొమా ఇన్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ , హార్టికల్చర్, డిప్లొమా ఇన్ యానిమల్ హస్బెండరీ , ఫిషరీస్లో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని శ్రీ సంగమేశ్వర ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ , పాలీసెట్ కో-ఆర్డినేటర్ శ్రీ డి కుమారస్వామి తెలియజేసారు. పాలిసెట్ 2024 ఏప్రిల్ 22 చివరి తేదీ. అందువల్ల 10వ తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులందరూ దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మతోన్మాద గుండాల దాడిని ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ నిరసన

నవతెలంగాణ-సంగారెడ్డి

హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో నిన్న బుధవారం రోజున అర్ధరాత్రి ఎస్ఎఫ్ఐ నాయకుల పైన జరిగిన ఏబీవీపీ మతోన్మాద గుండాలు చేసిన దాడిని ఖండిస్తూ గురువారం ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ కూటమి విద్యార్థి సంఘం ఎన్నికల్లో విజయం సాధించింది అన్నారు. అది తట్టుకోలేక ఏబీవీపీ మతోన్మాద గుండాలు ప్రతిరోజు ఏదో ఒక దాడికి ఎస్ఎఫ్ఐ నాయకులపైన పాల్పడుతున్నారన్నారని అన్నారు. ఎదురుగా నిలబడే దమ్ము లేక అక్రమంగా విద్యార్థి విద్యార్థి సంఘ నాయకులపైన దాడులు



చేస్తూ యూనివర్సిటీలో ఒక గుండ రాజకీయాలను చేస్తున్నారన్నారని అన్నారు. ఈ దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థుల విద్యార్థి నాయకులపైన దాడి చేయడం సిగ్గుచేటు అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించే దమ్ములేని మతోన్మాద సంఘం విద్యార్థుల పైన దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. మీకు దమ్ముంటే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు మీ బలం ఏంటిదో మొన్న జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో తెలిసిందన్నారు. ఈ దాడికి పాల్పడిన వారి పైన రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ అధికారులు చట్టబరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా దేశవ్యాప్తంగా ఉద్యమాలు ఉధతం చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, శ్రీకాంత్, కార్తీక్, అనిల్, సందీప్, కుమార్, పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

పారిశ్రామికవేత్తలతో జిల్లా ఎస్పీ సిహెచ్ రూపేష్
నవతెలంగాణ - గుమ్మడిదల



పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పి సిహెచ్ రుపేష్ అన్నారు. గురువారం గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి పారిశ్రామికవాడలో హెటిరో యూనిట్ 1 పరిశ్రమలో బొంతపల్లి, బొల్లారం, కాజిపల్లి, పారిశ్రామికవేత్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సిహెచ్ రూపేష్ మాట్లాడుతూ పరిశ్రమలలో తయారు చేస్తున్నటువంటి ఉత్పత్తుల వివరాలను బోర్డులు ఏర్పాటు చేయాలని, అనుకోని పరిస్థితుల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటే వాటిని నివారించుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో బోర్డుల్లో వివరించాలని పారిశ్రామికవేత్తలకు వివరించారు ఇటీవల హత్నూర మండలం చందాపూర్ గ్రామ పరిధిలోని పరిశ్రమలో జరిగిన ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకొని పారిశ్రామికవేత్తలు పోలీస్ అధికారులకు సహకరించాలని కోరారు కార్మికుల పట్ల తీసుకోవలసిన సేఫ్టీ జాగ్రత్తలు కచ్చితంగా తీసుకోవాలని సూచించారు రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలను అమలు చేస్తున్నామని అయినప్పటికీ అక్కడక్కడ ట్రాఫిక్ సమస్య ఉన్నట్లు పలువురు మా దృష్టికి తీసుకువచ్చారని వెంటనే అట్టి ప్రాంతాలలో సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపడతామని తెలిపారు పరిశ్రమలలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటి పనితీరుపై ఎప్పటికప్పుడు పరీక్షించాలని సూచించారు కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సంజీవరావు త్రిబుల్ ఎస్ సి జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ హెటిరో యూనిట్ 1 వెంకటేశ్వరరావు సిఐలు జిన్నారం సుధీర్ కుమార్ బొల్లారం గంగాధర్ పటాన్‌చెరు శ్రవణ్ కుమార్ నియోజకవర్గ పరిధిలోని ఎస్సైలు పారిశ్రామికవేతలు పాల్గొన్నారు

ప్రమాదకరంగా మారిన డ్రైనేజీ కాలువలు

పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ - జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని జాతీయ రహదారి 65కు ఇరువైపులా ఎంపీ నిధులతో గతంలో ఏర్పాటు చేసిన వరద నీటి కాలువకు ఏ విధమైన కల్వర్టులను ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. జహీరాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్టాప్ పూర్ చౌరస్తా వద్ద సబ్ స్టేషన్ ముందు భారత్ పెట్రోల్ పంప్ వద్ద కనీసం ఈ వరద నీటి కాలువ వద్ద ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు ప్రమాదవశాత్తు కాలువలో పడుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్ఎఫ్ఐ నాయకులపై ఏబీవీపీ దాడి హేయం

ఎస్ఎఫ్ఐ జహీరాబాద్ ఏరియా కార్యదర్శి విష్ణువర్ధన్
నవతెలంగాణ -జహీరాబాద్



తాగిన మైకంలో ఏబీవీపీ గుండాలు ఎస్ఎఫ్ఐ నాయకులపై కత్తులతో దాడి చేయడం ఏమైనా చర్య అని ఎస్ఎఫ్ఐ ఏరియా కార్యదర్శి విష్ణువర్ధన్ అన్నారు. గురువారం పాత్రికేయులతో మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకులపై ఏబీవీపీ గుండాలు మద్యం మత్తులో ఎస్ఎఫ్ఐ నాయకులపై కత్తులతో దాడి నీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ కార్యదర్శి విష్ణువర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఏరియా కార్యదర్శి విష్ణువర్ధన్ మాట్లాడుతూ మొన్న జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికలలో లెఫ్ట్ కూటమి విద్యార్థి సంఘం గెలుపొందిన నేపథ్యంలో జీర్ణించుకోలేక ఏబీవీపీ గుండాలు మద్యం మత్తులో దాడులకు దిగబడ్డారని విద్యార్థి సంఘం అధ్యక్షుడు ఎండి లతీప్ అహ్మద్ యూనిట్ సెక్రటరీ కృపజార్జ్ తదితరులపై దాడి చేశారు. మహిళా సహచరులను ఏబీవీపీ గుండాలు దుర్భాషలాడారని మహిళలను చూడకుండా భౌతికంగా దాడులకు పాల్పడ్డారని కేవలం మూడు రోజుల ముందు వారు క్రియాశీల సభ్యుడు హర్షపై దాడి చేశారని ఇది మంచిపరిణామం కాదన్నారు. పోలీసులు సంబంధిత దోషులను వెంటనే శిక్షించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గణేష్, సజీద్, రాము, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

జోగినాథ స్వామి ఉత్సవ విగ్రహానికి అభిషేకం

నవతెలంగాణ-జోగిపేట



జోగినాథ రథోత్సవ ఉత్సవాలలో భాగంగా గురువారం శ్రీ జోగినాథ స్వామి ఉత్సవ విగ్రహానికి అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. స్థానిక ఆలయం వద్ద వెండితో తయారు చేసిన భారీ శ్రీ జోగినాథుని విగ్రహానికి ఆలయ నిర్వహకులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. జోగినాథ స్వామి దేవాలయం నుండి గౌని చౌరస్తా వద్ద గల రథం వరకు ఊరేగింపు చేసి రథంపై స్వామి వారిని ప్రతిష్ఠించి, రథం వద్ద పూజలు చేసి రథయాత్ర నిర్వహించినట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రథోత్సవం కమిటీ అధ్యక్షులు డాకూరి శివ శంకర్, ఆలయ పూజారులు భద్రప్ప, సుజిత్, సభ్యులు పట్లూరి శివ శేఖర్, సురేందర్ గౌడ్, డిబి నాగభూషణం, చాపల వెంకటేశం, చింతల సురేష్, రంగ సురేష్, అవుసలి ప్రభాకర్, రెడ్డి పల్లి బ్రహ్మయ్య, అల్లె యాదగిరి, అంతం శ్రీనివాస్, డి.శ్యామ్, ఉలువల సురేష్, రవి, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

సంజీవిని లేక్ సిటీ పేరుతో వెంచర్

ఉబా చెరువును ఆక్రమిస్తున్నా పట్టించుకోని అధికారులు
నవతెలంగాణ- సదాశివపేట



సంజీవని లేకొసిటీ పేరుతో ఏర్పాటు చేసిన వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని టి సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ చారి అన్నారు. గురువారం సదాశివపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో బహుజన స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ దప్పు రాజుతో కలిసి టీ సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ చారి మాట్లాడుతూ సదాశివపేటలో ఉబ చెరువు కింద సర్వే నంబర్ 399లో మైసమ్మ గుడిని పూడ్చి వేస్తూ మినీ ట్యాంక్ బండ్‌ను సైతం కూల్చి రోడ్డు వేసిన అధికారులు పట్టనట్లుగా వ్యవహరించడం చూస్తుంటే అధికారులు పనితీరు ఎలా ఉందో అర్థం అవుతుందన్నారు. మామూళ్లకు లొంగి గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన మినీ ట్యాంక్ బండ్‌ను సైతం కూల్చివేసినా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కలెక్టర్ ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా నిర్మించిన వెంచర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మామూళ్లకు లొంగి అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీ సీపీఐ పార్టీ డిమాండ్ చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి బాబా, శివ, తదితరులు పాల్గొన్నారు.

ఏరులై పారుతున్న మంచినీరు

పట్టించుకోని మున్సిపల్ అధికారులు
నవతెలంగాణ - జహీరాబాద్



జహీరాబాద్ పట్టణానికి తాగునీరు సరఫరా చేసే సింగూరు నీటి పైపులు లీక్ అవుతున్నాయి. దీంతో గత 15 రోజులుగా ఏరులై నీరు పారుతున్నప్పటికీ మున్సిపల్ అధికారులు కానీ ప్రాజెక్టు అధికారులు కానీ పట్టించుకోవడం లేదు. దీనివల్ల రోజుకు కొన్ని వేల లీటర్ల నీళ్లు వృధాగా పోతున్నాయి. పట్టణంలోని సిద్దేశ్వర మఠానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పైపులు పగిలిపోవడంతో నీళ్లు వృధాగా పంట పొలాల్లోకి మటక వాగులోకి వెళుతున్నాయి. అదే రోడ్డుపై నుండి నిత్యం పూజల కోసం వెళ్లేటటువంటి అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంతో నీళ్లు పొలాల్లోకి వెళ్లడంతో పాటు కలుషిత నీళ్లు పైపుల్లోకలుస్తున్నాయని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించే తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఫిర్యాదు చేసేందుకు సమాచారం ఇచ్చేందుకు మున్సిపల్ కమిషనర్‌కు ఎన్నిసార్లు ఫోన్లు చేసినా కనీసం ఫోన్ కు సమాధానం కూడా ఇవ్వడం లేదని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు.

మంచినీటి పైపులకు మరమ్మతులు

నవ తెలంగాణ వార్తకు స్పందన
నవతెలంగాణ -పుల్కల్



మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు బుధవారం పైపు లీకేజై మంజీరా నీరు వృధాగా పోయింది. అది నవ తెలంగాణ కెమెరాకు చిక్కడంతో వృధాగా పోతున్న మంజీరా నీరు పట్టించుకోని అధికారులు అనే శీర్షిక గురువారం నాడు నవతెలంగాణ దినపత్రికలో ప్రచురితమైంది

నవతెలంగాణ స్పందన

అట్టి వార్తకు స్పందించిన అధికారులు మిషన్ భగీరథ కార్మికుల చేత అట్టి పైపులను మరమ్మతులు చేయించారు. నీటి సరఫరా యధావిధిగా సరఫరా అవుతుంది అని మిషన్ భగీరథ కార్మికుడు కృష్ణ అన్నారు .

గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి
నవ తెలంగాణ- గజ్వేల్



గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ మండలం దిలాల్పూర్ గ్రామంలో లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో గజ్వేల్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గజ్వేల్ అభివృద్ధి చెందుతుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతంలో ఉన్న దేవాలయాల అభివృద్ధికి కృషి జరుగుతుందని ఆయన అన్నారు. గతంలో దేవాలయాలు అభివృద్ధికి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఎంతో కృషి చేశారని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నక్క రాములు గౌడ్, రాజు, రమేష్ తదితరులు ఉన్నారు.

ప్రతి గ్రామంలో దేవాలయాల పునర్నిర్మాణం చేసుకోవాలి



నవతెలంగాణ- గజ్వేల్ : ప్రతి గ్రామంలో పురాణత దేవాలయాలు శిధిలావస్థకు చేరాయని వాటిని పునర్నిర్మాణం చేసుకోవాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని ముట్రాజ్ పల్లి లో దుర్గమ్మ గుడిని నూతనంగా నిర్మిస్తున్నట్లు గ్రామానికి చెందిన కృష్ణ, భాను ప్రసాద్, తన దృష్టికి తీసుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. దీంతో గుడి నిర్మాణానికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నూతన దేవాలయాలతో పాటు సామాజిక వర్గాలుగా ప్రస్తుతం దేవాలయాలను నిర్మించుకుంటున్నారని పురాణత దేవాలయం కూడా పునర్నిర్మాణం చేసుకోవాలని ఆయన సూచించారు. గతంలోనే గజ్వేల్ లో ఉమామహేశ్వర దేవాలయం, మాంకాలమ్మ దేవాలయ పునర్నిర్మాణం చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు. ఇది ఇలా ఉండగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న ప్రచారంపై నవ తెలంగాణ ఆయన దృష్టికి తీసుకపోగా వాస్తవమేని ఆయన తెలిపారు.

ఎండకు తల్లడిల్లుతున్న ఉపాధి హామీ కూలీలు

డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి



నవ తెలంగాణ -గజ్వేల్

ఎండకు తల్లడిల్లుతున్న ఉపాధి హామీ కూలీలకు నీడ సౌకర్యం కల్పించాలని గురువారం డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పనుల దగ్గర నిలువ నీడలేక ఎండ వేడిమికి ఉపాధి కూలీలు తల్లడిల్లుతున్నరన్నారు. పని దగ్గర నీడ లేదు నీరు లేదు ఓ ఆర్ ఎస్ ఎస్ ప్యాకెట్లు లేవు అరకొర ప్రాథమిక చికిత్స బాక్సులున్నాయన్నారు.

20న బీఆర్ఎస్ సభను విజయవంతం చేద్దాం

నవతెలంగాణ - దౌల్తాబాద్



ఉమ్మడి దౌల్తాబాద్ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశాన్ని మండల కేంద్రమైన రాయపోల్ జిఎల్ఆర్ ఫంక్షన్ హాల్లో ఈనెల 20 శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించడం జరుగుతుందని దౌల్తాబాద్ బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సయ్యద్ రహీముద్దీన్ గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో గులాబి జెండా ఎగరడం ఖాయమని ఆయన అన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మెదక్ పార్లమెంటు అభ్యర్థి వెంకట్రామిరెడ్డితో పాటు. బిఆర్ఎస్ కార్యకర్తలు ఎంపీపీ, జెడ్పిటిసి ఎంపీటీసీ తాజా మాజీ సర్పంచులు ,వార్డ్ సభ్యులతోపాటు తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.

14 స్థానాల్లో కాంగ్రెస్ విజయం ఖాయం



నవతెలంగాణ- గజ్వేల్ : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 14 పార్లమెంట్ స్థానాలు గెలుపొందుతుందని మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు బండారు శ్రీకాంత్ రావు అన్నారు. గురువారం ఈ మేరకు ఏఐసీసీ, పీసీసీ బండారు శ్రీకాంత్ రావు ను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా గజ్వేల్ లో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కృషితో 14 పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుని దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వం ఇంటికి పోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
మనసు తెలుగు దినపత్రిక
మెదక్
శుక్రవారం | 19 ఏప్రిల్ 2024 | www.navatelangana.com

20న నామినేషన్ వేయనున్న కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు

- హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు ఈ నెల 20వ తేదిన జిల్లా కేంద్రమైన మెదక్ కలెక్టరేట్ కార్యాలయంలో నామినేషన్ వేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్‌లు తెలిపారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు నామినేషన్ దాఖలు సందర్భంగా మెదక్‌లో ఉదయం 11 గంటలకు భారీ రోడ్ షో కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి నర్సాపూర్ నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ ఎన్నికల మహిళ ఇంఛార్జి సుజాత, ఎంపీపీ జ్యోతి సురేష్ నాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేశం, నాయకులు శ్రీనివాస్ గుప్తా, నరేందర్ రెడ్డి, హబీబ్ ఖాన్, శ్రీనివాస్ గౌడ్, రిజ్వాన్, సుదర్శన్ గౌడ్, కరుణాకర్ రెడ్డి, సయ్యద్ పాషా, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి రవాణా చేస్తున్న మూడు టిప్పర్‌లు సీజ్



నవతెలంగాణ-మనోహరాబాద్

మండలంలో బుధవారం అర్ధ రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న మూడు టిప్పర్‌లను సీజ్ చేసినట్టు మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో మనోహరాబాద్ శివారులో నడుస్తున్న మూడు టిప్పర్లను పట్టుకొని సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. మండలంలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ మట్టి రవాణా చేసినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకోనున్నట్టు మనోహరాబాద్ ఎస్సై కరుణాకర్ రెడ్డి హెచ్చరించారు.

చెరువుల ఆక్రమణ నుంచి తొలగించి రక్షణ చర్యలు తీసుకోవాలి

- తహశీల్దార్‌కు రామాయిపల్లి గ్రామ ప్రజల వినతి

నవతెలంగాణ-మనోహరాబాద్

రామాయిపల్లి పెద్ద చెరువు చిన్న చెరువు కుంటలను ఆక్రమించి మరికొందరు ప్లాట్లు తయారు చేస్తున్నారని అలాంటి శిఖం భూములకు రక్షణ చర్యలు తీసుకుని న్యాయం చేయాలంటూ రామాయిపల్లి గ్రామ ప్రజలు డిప్యూటీ తహసీల్దార్ కౌషికరెడ్డికి వినతి పత్రం అందజేశారు. మండలంలోని రామాయిపల్లి గ్రామ పెద్ద చెరువు, చిన్న చెరువు, పోతరాజు కుంట, పెద్దమ్మ కుంట, ఆక్రమణకు గురి అయినట్టు తెలిపారు. అలాగే ఇట్టి భూమిలో ప్రైవేటు వెంచర్ యాజమాన్యం ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నట్టు తెలిపారు. దాంతో పాటు శిఖం భూమిలో మట్టిని నింపి చెరువును అన్యాక్రాంతం చేస్తున్నట్టు వారు తెలిపారు. ఇంత జరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది వరకు కూడా అధికారులకు విన్నవించినట్టు వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిఖం మొత్తం భూములకు హద్దులు నిర్ణయించి కందకం తవ్వించి రక్షణ కల్పించి భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలాగే మనోహరాబాద్ పట్టణం మురికి నీటిని, కెమికల్ నీటిని చెరువులోకి వదులుతున్నారని దాంతో చెరువులో ఉన్న చేపలు మరణిస్తున్నట్టు తెలిపారు. పశువులు కూడా డ్రైనేజీ నీటిని తాగి రోగాల బారిన పడి మరణిస్తున్నట్టు తెలిపారు. అలాగే త్రాగు నీటికై వేసిన బోరులోని నీరు కూడా కలుషితమై నీరు తాగలేని పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాంతో పాటు గ్రామంలో మిషన్ భగీరథ నీరు కూడా సరిగా అందక పోవడంతో కలుషిత నీరు తాగడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నట్టు గ్రామ ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామ ప్రజల సమస్యలను తీర్చి చెరువులకు కుంటలకు రక్షణ కల్పించి ప్రజలకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రామాయిపల్లి మత్స్య సహకార సోసైటీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు డైరెక్టర్‌లు తదితరులు ఉన్నారు.

హ్యాట్రిక్ ప్రధాన మంత్రిగా మోడీ..

- బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావును గెలిపించండి
- పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను దోచుకుంది
- అవినీతి పరులకు తీహార్, చర్లపల్లి జైలే దిక్కు
- గోవా సీఎం ప్రమోద్ సావంత్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి



నవతెలంగాణ-మెదక్

వికసిత భారత్ కోసం దేశ ప్రజలు ప్రధాని మోడీ నాయకత్వాన్నే ఇష్టపడుతున్నారని గోవా సీఎం ప్రమోద్ సావంత్ పేర్కొన్నారు. గురువారం మెదక్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా మెదక్ పట్టణంలోని సాయి బాలాజీ గార్డెన్స్ నుంచి రాందాస్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా గోవా సీఎం ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాల వల్లే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ళ తెలంగాణను దోచుకుందన్నారు. మోడీ ప్రభుత్వం నారీ శక్తి, యువ శక్తి, కిసాన్ శక్తి, గరీబ్ కళ్యాణ్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అవినీతిపరుడైన మెదక్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ కలెక్టర్ ను ఇంటికి పంపాలని, బిజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ను ఢిల్లీ పార్లమెంట్ కు పంపాలని తెలియజేశారు. ఇంటింటికి వెళ్లి మోడీ పథకాల గురించి వివరించాలని తెలిపారు. మూడోసారి ప్రధాన మంత్రి మోడీ అవుతున్నట్లు తెలిపారు. అనంతరం బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ..తెలంగాణ వచ్చాక కేసీఆర్ కుటుంబ పాలన చేసి అన్ని రకాల కుంభకోణాలు చేశారని తెలిపారు. సచివాలయానికి ఒక్కరోజు రాన్ని కేసీఆర్ కు తెలంగాణ ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. ఇక తెలంగాణలో కేసీఆర్ పాలన అవసరం లేదని తెలిపారు. తెలంగాణలో 17 స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కేసీఆర్ కుటుంభం తెలంగాణను దోచుకుంది సరిపోక ఢిల్లీకి వెళ్లి లిక్కర్ వ్యాపారం చేశారన్నారు. తీగ లాగితే డొంక కదిలినట్లు ఢిల్లీ ప్రభుత్వం పై దర్యాప్తు చేస్తే కవిత దొరికిందని తెలిపారు. లిక్కర్ కేసులో దొరికి తెలంగాణ పరువు, మహిళల పరువు తీశారన్నారు. అవినీతి పరులు ఎవరైనా తీహార్, చర్లపల్లి జైలే దిక్కని, ప్రజల సొమ్మును దోచుకుంటే వదిలే ప్రసక్తి లేదన్నారు.. 140 కోట్ల ప్రజల ఆశీస్సులతో హ్యాట్రిక్ ప్రధాన మంత్రిగా మోడీ ప్రమాణ స్వీకారం చేస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. తెలంగాణలో మరో పార్టీకి భవిషత్ లేదని, ఎన్నికల్లో బీఆర్ఎస్ కు డిపాజిట్ రాదని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి భారీ మెజారిటీతో తెలంగాణలోనూ అధికారంలోకి వస్తుందన్నారు. అనంతరం మెదక్ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి రఘునందన్ రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు మెదక్ గడ్డ మీద పుట్టిన వాడు ఒక్కడు దొరకలేదా అని ప్రశ్నించారు. కామారెడ్డిలో కేసీఆర్ ను కాషాయం జెండా తొక్కిందని, నిజామాబాద్ లో కవితని తొక్కితే తీహార్ జైలులో తేలిందన్నారు. ధన బలానికి, జన బలానికి మధ్య జరుగుతున్న యుద్ధంలో రాముడి ఆశీస్సులతో చట్ట సభల్లో ప్రజా గొంతుకగా నిలిచేలా ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ప్రజలకు సేవా చేసే అవకాశాన్ని కల్పించాలన్నారు. గతంలో మెదక్ ఎంపీ గా ఉన్న ప్రభాకర్ రెడ్డి ఎప్పుడు కనిపించలేదని, ఏ పని చేయలేదని విమర్శించారు. ఎవరీ వెంకట్రామ్ రెడ్డి, ఎందుకు ఓటు వేయాలన్నారు. కేసీఆర్ కాళ్ళు మొక్కి టిక్కెట్ తెచ్చుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తన గురించి మాట్లాడటం విడ్డూరమన్నారు. దమ్ముంటే వెంకట్రామిరెడ్డి మల్లన్న సాగర్ ముంపు గ్రామాలకు పోలీసు బందోబస్తు లేకుండా రావాలని సవాల్ విసిరారు. మెదక్ జిల్లాలో రోషం ఉన్నోళ్లు పుట్టినారని, పక్క జిల్లా వాడికి అవకాశం ఇవ్వరన్నారు.. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లాల అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ ఉన్నారు.

నీలం మధును కలిసిన బంజారా నాయకులు



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని జెడ్చెరువు గ్రామ పంచాయతీకి చెందిన కాంగ్రెస్ నాయకులు మలావత్ నరేష్ , సంగ్రుడు శ్రీకాంత్, రమావత్ రవి, కృష్ణ గౌడ్ మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును కలిశారు. మాలోత్ నరేష్ మాట్లాడుతూ మెదక్ పార్లమెంటు సభ్యులుగా నీలం మధును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు డిపాజిట్లు కుడా రాకుండా చేస్తామన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎంపీటీసీ



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని నందిగామ గ్రామ ఎంపీటీసీ లద్ద సురేష్ గురువారం మెదక్ఎమ్మెల్యే రోహిత్ రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దేశెటి సిద్దరాములు, రామాయంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్ రెడ్డి, గుగులోతు రవి, తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయ నిర్మాణానికి రూ. 10,111ల విరాళం



నవతెలంగాణ-నర్సాపూర్

మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయ నిర్మాణానికి గురువారం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ జక్కుల వెంకటేశం తన వంతు సహాయంగా రూ.10,111ల విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ కరుణాకర్, ఎంపీటీసీ శోభ విజయకుమార్, గ్రామస్తులు మధుసూదన్ రెడ్డి, నాగులు, రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మీడియా సెంటర్‌ను పరిశీలించిన జిల్లా వ్యయ పరిశీలకుడు



నవతెలంగాణ-మెదక్

సాధారణ ఎన్నికలు-2024 ఎన్నికల నియమావళిలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎంసిఎంసి మీడియా సెంటర్‌ను జిల్లా వ్యయ పరిశీలకులు సునీల్ కుమార్ రాజ్ వాన్షి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. జిల్లాలో చెక్ పోస్టుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల రికార్డింగ్ పనితీరును పరిశీలించారు. సి విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాలు, ఎస్ఎస్టి, ఎఫ్ఎస్టీ టీమ్ పనితీరు, మీడియాలో వచ్చే వార్తలు, పేడ్ న్యూస్, పత్రిక ప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియా రికార్డింగ్ పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బ్యాంక్ అకౌంట్ సమాచారం, ఒకేసారి పెద్ద మొత్తంలో డబ్బు జమ అయిన వారి అకౌంట్ సమాచారం, వాటి వివరాలు, జీఎస్టి అకౌంట్ వంటి వివరాలు, ఇప్పటివరకు సీజ్ అయిన డబ్బు, మద్యం, నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్‌లో ఐదు సెట్ల నామినేషన్లు

- స్వీకరించిన రిటర్నింగ్ అధికారి రాహుల్ రాజ్
- మెదక్ కలెక్టరేట్ వద్ద మూడంచెల భద్రత





నవతెలంగాణ-మెదక్

లోక్ సభ ఎన్నికల నోటిఫికేషన్ ప్రక్రియలో భాగంగా మెదక్ పార్లమెంటరీ నియోజకవర్గ స్థానానికి పోటీ చేసేందుకు గురువారం తొలి రోజు ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. మెదక్ కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కౌంటర్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నామినేషన్లను స్వీకరించారు. కలెక్టరేట్ వద్ద పోలీసులు మూడంచెల కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. బిజేపీ అభ్యర్థి రఘునందన్ రావు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు పంజా విజయ్ కుమార్‌తో కలిసి ఒక్క సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు తరపున మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు గౌడ్, ఇంఛార్జి ఆవుల రాజిరెడ్డి, మెదక్ మున్సిపల్ ఛైర్మెన్ చంద్రపాల్‌తో కలిసి ఒక్క సెట్ నామినేషన్ పత్రాలను అందజేశారు. అలాగే తెలంగాణ ప్రజాశక్తి పార్టీ అభ్యర్థిగా సంగారెడ్డి జిల్లా సదాశివపేటకు చెందిన దొడ్ల వెంకటేశం రెండు సెట్ల నామినేషన్ పత్రాలను, నర్సాపూర్ పట్టణానికి చెందిన చిక్కులపల్లి నవీన్ కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా ఒక్క సెట్ నామినేషన్‌ను అందజేశారు.

డబ్బు మూటలతో ఏం చేయలేరు

- బలహీన వర్గాల బిడ్డ నీలం మధును ఆశీర్వదించాలి
- 20న మెదక్‌కు సీఎం రేవంత్ రెడ్డి
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



నవతెలంగాణ-మెదక్

ప్రజలు చైతన్యవంతులని, బీఆర్ఎస్ నేతలు డబ్బు మూటలతో వచ్చి ఏం చేయలేరని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. గురువారం మెదక్ కలెక్టరేట్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు తరపున డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నర్సాపూర్ ఇంఛార్జి రాజిరెడ్డి, మెదక్ మున్సిపల్ ఛైర్మన్ చంద్రపాల్‌తో కలిసి నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మెదక్ మండలం మాచవరంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ముద్దు బిడ్డ కాంగ్రెస్ పార్టీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధును ఆశీర్వదించాలన్నారు. నీలం మధుకు మద్దతుగా ఈ నెల 20 వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి మెదక్ పట్టణానికి విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల అభీష్టం మేరకు పాలన కొనసాగిస్తుందని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ పార్టీకి చేదు అనుభవం ఎదురవుతుందని తెలిపారు. జిల్లాలోనే తనను ఎమ్మెల్యేగా ఓడించేందుకు 100 కోట్ల డబ్బుల మూటలను ప్రస్తుత మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నియోజకవర్గానికి పోలీసు వాహనాల్లో తరలించారని తెలిపారు. డబ్బు మూటలు ఎన్ని తరలించిన తమ వెంట్రుక కూడా పీకలేరని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ అభ్యర్థి కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఎంతో దోచుకున్నాడని ఆరోపించారు. ఆయన ప్రచార వాహనానికి ఇటీవల ప్రజలు చెప్పుల దండలు వేశారని, ఇలాంటి దొంగలను తరిమికొట్టాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలు వంద రోజుల్లో అమలు చేసి మాట నిలబెట్టుకుంటుందని, మరింత ఉత్సాహంతో అభివృద్ధి ముందుకు సాగాలంటే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బొజ్జ పవన్, వెంకటరమణ, ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ చౌదరి, మధుతో పాటు పలువురు పాల్గొన్నారు.

విస్తరణ బాటలో పాల్మోర్ స్టీల్

- పరిశ్రమను సందర్శించిన పోలాండ్ బృందం
- యురోపియన్ రైళ్ల ఉత్పత్తి కంపెనీలకు కీలక విడిభాగాలను అందజేస్తున్న పాల్మోర్ పరిశ్రమ







నవతెలంగాణ-మనోహరాబాద్

యురోపియన్ రైల్వే ఉత్పత్తి కంపెనీలకు కీలకమైన విడి బాగాలను తయారు చేసి ఇచ్చే పాల్మోర్ స్టీల్ పరిశ్రమను గురువారం పోలాండ్ రాయబారి డాక్టర్ సెబాస్టియన్ డొమ్‌జల్స్కి సందర్శించారు. ఆయనతో పాటు పోలండ్ కాన్సుల్ జనరల్ డాక్టర్ అలెగ్జాండర్ దండా, పోలండ్ రాయబార కార్యాలయంలో ఆర్థిక వ్యవహారాల కౌన్సెలర్ పావెల్ మోక్రజైకిలు ఉన్నారు. ఈ సందర్భంగా పాల్మోర్ స్టీల్ మేనేజింగ్ డైరెక్టర్ కెవిఆర్ సుబ్బారావ్‌తో కలిసి ఇప్పుడున్న ప్లాంట్‌తో పాటు నిర్మాణంలో ఉన్న రెండో ప్లాంట్‌ను సందర్శించారు. వారికి ప్లాంట్ పూర్తి వివరాలను డాక్టర్ కెవిఆర్ సుబ్బారావ్ దగ్గరుండి వివరించారు. మనోహరాబాద్ మండలంలోని పారిశ్రామిక ప్రాంతంలో రైల్వే విడిభాగాలు తయారు చేసే సంస్థ తెలంగాణలో భారీగా విస్తరించి తద్వార ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సిద్ధమవుతోంది. ఆటోమోటివ్ పార్క్‌లో ఉన్న ఈ సంస్థ వృద్ధి బాటలో కొనసాగుతోంది. భారతదేశంలో ఒక పొలాండ్ కంపెనీ సాధిస్తున్న వృద్ధిని చూసి రాయబారి డొమ్‌జల్స్కి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇక్కడ ఉద్యోగాలు కల్పిస్తున్న పాల్మోర్ స్టీల్ కంపెనీని ఆయన అభినందించారు. కేంద్ర ప్రభుత్వం సూచిస్తున్న మేకిన్ ఇండియా విదానానికి అనుగుణంగా సాగుతున్న ఈ కంపెనీ తన విజయాలను మరింతగా కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు. తమ సంస్థ విస్తరణ వ్యూహాల గురించి పాల్మోర్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కెవిఆర్ సుబ్బారావ్ మాట్లాడుతూ భారతదేశంలో పలు యురోపియన్ కంపెనీలు ఉన్నాయని అదే బాటలో పాల్మోర్ స్టీల్ పరిశ్రమ కూడా మరింతగా విస్తరిస్తుందని గర్వంగా ఆయన వివరించారు. మరో మూడెకరాల భూమిని తీసుకుని 2.5 మిలియన్ యురోల పెట్టుబడి కూడా సంపాదించిఅదనంగా మరో వంద మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. అంతే కాకుండా పొలండ్‌లోని మాతృ సంస్థలో కూడా 30 మంది పాల్మోర్ స్టీల్ ఉద్యోగులు ఇక్కడి నుండి వెళ్లి పనిచేస్తున్నట్టు తెలిపారు. దీని వల్ల మనవాళ్లు యూరప్ వెళ్లి అక్కడ నైపుణ్యాలను పెంపొందించుకోవడంతో పాటు యురోపియన్ ప్రమాణాలతో ఉత్పత్తులు తయారు చేయడానికి వీలు కలుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం టీఎస్ఐఐసిలతో పాటు వివిధ వర్గాల నుంచి అందుతున్న అపార మద్దతు పట్ల సుబ్బారావ్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్లాంటుకు వచ్చి తమను ప్రోత్సహించినందుకు రాయబారికి, కౌన్సిల్ జనరల్‌కు, ఆర్థిక కౌన్సెలర్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమ ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలలో రాణించాలి

- రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శోభన్ బాబు



నవతెలంగాణ-మనోహరాబాద్

కర్నాటక రాష్ట్రంలోని టు మ్యూర్‌లో ఈ నెల 28 నుంచి 30వ తేది వరకు జరిగే 3వ జాతీయ స్థాయి సౌత్ జోన్ సాఫ్ట్ బాల్ చాంపియన్షిప్‌లో తెలంగాణ బాల బాలికల జట్టు రాణించాలని తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు శోభన్ బాబు పేర్కొన్నారు. జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మనోహరాబాద్‌లోని స్థానిక తెలంగాణ క్రీడా ప్రాంగణంలో జరిగిన తెలంగాణ బాల బాలికల ఎంపిక ప్రక్రియకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీలలో తెలంగాణ జట్టు విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ ఎంపిక ప్రక్రియకు తెలంగాణలోని 16 జిల్లాల నుంచి సుమారు 60 మంది బాలురు, 50 మంది బాలికలు హాజరయ్యారు. ఎంపిక ప్రక్రియలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి శిక్షణ శిబిరానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ కోశాధికారి రేణుక, నల్గొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగి రెడ్డి, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యనిర్వహక కార్యదర్శి గంగాల రమేష్, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షులు అజయ్ కుమా ర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యాం సుందర్ శర్మ, కోశాధికారి గోవర్ధన్ గౌడ్, సర్కిల్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, కుమార్ గౌడ్, సురేష్, వెంకట్ రెడ్డి , పొట్టోల్ వెం కటేశ్ గౌడ్, కృష్ణ, గిరిరాయని శ్రీనివాస్, చోళ్లేటి సూర్య ప్రకాష్, సబ్ ఇన్స్పెక్టర్ హరీష్ సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీరాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ మహెూత్స వాలు



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో నేటి నుంచి మూడు రోజులపాటు వీరాంజనేయ విగ్రహ ప్రతిష్ఠ మహెూత్సవాలు నిర్వహించనున్నట్లు తాజా మాజీ సర్పంచ్ కరుణాకర్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు 19న శ్రీ వీరాంజనేయ శివ పంచాయతన సహిత, బొడ్డు రాయి ప్రతిష్ఠ మహెూత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రతిష్టా మహెూత్సవానికి శ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామి హాజరవుతున్నట్లు తెలిపారు. మొదటి రోజు 19న గణపతి పూజ, పుణ్యా వచనం, ధ్వజారోహణం, గోపూజ, మండపారాధన దీక్షాధారణ స్వామి వారి విగ్రహ ఊరేగింపు జలాధివాసంతో పాటు తీర్థప్రసాద వితరణ, రెండవ రోజు 20న ఉదయం నుంచి సర్వతోభద్ర వాస్తు, యోగిని మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ, మహాస్థానం సాయంత్రం మన్యుసూక్త రుద్ర హవనము, పలా పుష్ప ధాన్యాశయ్యాది నివాసము, రాజోపచార పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడవరోజు 21న ఆవాహిత దేవతారాధన, గర్త సంస్కారం శ్రీ శ్రీ మాధవానంద సరస్వతీ స్వామి ఆశీస్సులచే వీరాంజనేయ శివ పంచాయతన ధ్వజస్తంభ నాభి శిలా యంత్ర ప్రతిష్ఠ మూర్తి ప్రతిష్ఠ అనంతరం పూర్ణాహుతి, శాంతి కళ్యాణం, మహదాశీర్వచనం, తీర్థప్రసాదాల వితరణ వంటి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఆవంచలో జరిగే ఈ ప్రతిష్ఠ మహెూత్సవ కార్యక్రమానికి గ్రామ, పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి వీరాంజనేయ స్వామి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, జగన్, జనార్ధన్ రెడ్డి, విజయకుమార్, రఘువీరా రెడ్డి, జక్కుల శ్రీనివాస్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులు తనిఖీ నిర్వహించిన ఫైర్ ఆఫీసర్



నవ తెలంగాణ -గజ్వేల్

గజ్వేల్ పట్టణంలో పెట్రోల్ బంకులు గ్యాస్ గోదాముల యందు ఆకస్మిక తనిఖీలు చేసినట్లు జిల్లా సహాయక అగ్నిమాపక అధికారి పి సురేష్ కుమార్ తెలిపారు. గురువారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా తనిఖీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. పట్టణంలోని శేషమా ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నందు అగ్నిమాపక నిరోధక యంత్రాలు పనిచేయని స్థితిలో ఉన్నాయని, ఈ విషయమై మేనేజ్మెంట్ కి ఒక నోటీస్ జారీ చేసినట్లు ఆయన చెప్పారు. అదేవిధంగా పెట్రోల్ బంకుల్లోనూ మిగతా గ్యాస్ గోదాముల్లోనూ తనిఖీలు నిర్వహించి అవి పని చేయు విధానం గురించి వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. పెట్రోల్ బంక్ నిర్వాహకులు అందుబాటులో ఉంటూ మంచిగా పని చేసే విధంగా ఉండాలని ఆయన సూచించారు.

బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరికలు



నవ తెలంగాణ - సిద్దిపేట : సిద్దిపేట కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అధ్వర్యంలో అర్బన్ మండల బక్రీచేప్యాల గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు బక్రీ చెప్యాలా గ్రామం రెడ్డి సంఘం అధ్యక్షులు పురుమండ్ల వెంకటరెడ్డి, రెడ్డి సంఘం సెక్రెటరీ రాజశేఖర్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, మర్రి చంద్రం, భొగోళ్ల కనకయ్య, బిఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా సహాయ, సహకారాలు అందజేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్షితులై అన్ని వర్గాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అవుతున్నారని తెలిపారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మండల అధ్యక్షులు కొలిమి బిక్షపతి, నాయకులు నారాల బాబు, బాకురు రవి, కిసాన్ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ నాయిని నరసింహారెడ్డి ,కాంగ్రెస్ నాయకులు మంద పండు, కలిముద్దీన్ పాల్గొన్నారు.

గజ్వేల్‌లో బీజేపీకి షాక్

- నేడు కాంగ్రెస్‌లో చేరనున్న గాడి పల్లి

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గంలో బిజెపి పార్టీకి భారీ షాక్ తగల నున్నది. శుక్రవారం గాడిపల్లి భాస్కర్ కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత గాడి పల్లి భాస్కర్ శాసనసభ ఎన్నికల ముందు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్ రావు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ కాంతారావుపై విమర్శలు చేసి బిజెపి గజ్వేల్ అభ్యర్థిగా రంగంలో ఉన్న ఈటెల రాజేందర్ గెలుపు కోసం బిజెపిలో చేరారు. పార్టీలో పాత కొత్త తేడాతో మనస్పర్ధలు పార్టీలో వచ్చాయి. దీంతో బీజేపీ లో చేరిన ఆయన అనుచరులు ముఖ్య నాయకులు కాంగ్రెస్లో చేరేందుకు శుక్రవారం ముహూర్తం కుదుర్చుకున్నారు. దీంతో గజ్వేల్ బిజెపికి షాక్ తగలనుంది. నేడు గజ్వేల్ నియోజకవర్గం లో వివిధ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి భారీ చేరికలు ఉన్నాయి. ఇందులో భాగంగానే గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ తన అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హనుమంతరావు, తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. ఇందుకు కావలసిన సమీకరణలకు గురువారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ తన ఫామ్ హౌస్ కార్యకర్తలతో భాస్కర్ సమావేశం నిర్వహించారు. మాజీ కౌన్సిల్ సభ్యులు సుభాష్ చంద్రబోస్, సంతోషి రామచంద్ర చారి, రొట్టెల రామదాస్, మాజీ వార్డు నెంబర్ పూలసత్యం, పలువురు నాయకులు పార్టీలో చేరనున్నారు. ఈ చేరికలు గజ్వేల్ నియోజకవర్గం సమీపంలో ఉన్న వ్యవసాయ క్షేత్రంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. తెలుగుదేశం, బిఆర్ఎస్ పార్టీలలో జిల్లా స్థాయిలో పనిచేసిన గాడి పల్లి భాస్కర్ ఎమ్మెల్యే ఎన్నికల ముందు బిజెపిలో చేరారు. గతంలోనే దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు ఇంటికి వచ్చి పార్టీ మారవద్దని బుజ్జగించినట్లు తెలిసింది. గతంలో తెలుగుదేశంలో మైనంపల్లి హనుమంతరావు తో కలిసి భాస్కర్ పనిచేయడం వల్ల కాంగ్రెస్‌లో చేరికకు సులువైంది. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తో పాటు గజ్వేల్ నియోజకవర్గంలో కీలకంగా గాడి పల్లి భాస్కర్ మారుతారని వార్తలు వస్తున్నాయి.



ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా క్రీడల, యువజన సర్వీసుల శాఖ అధికారి నాగేందర్

నవ తెలంగాణ - సిద్దిపేట

రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ క్రీడల శాఖ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు 14ఏండ్లలోపు బాల, బాలికలకు వేసవి శిక్షణ శిబిరాలను సిద్దిపేట గ్రామీణ ప్రాంతములలో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల, యువజన సర్వీసుల శాఖ అధికారి నాగేందర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ క్రీడలను నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ నేషనల్ క్రీడాకారులు శిక్షణ ఇచ్చే క్రీడల వివరాలు, ప్రదేశం, గ్రామం, వివరాలు ఈనెల 22 లోపు జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయము, గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో స్వయంగా వచ్చి దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. క్రీడలు నిర్వహించే వారికి గౌరవ వేతనం, క్రీడా సామగ్రి అందించనున్నట్టు తెలిపారు. ఇతర వివరములకు సెల్ నెంబర్ 9014580816 సంప్రదించాలని సూచించారు.

రఘునందనరావు నామినేషన్‌లో మర్కూర్ బీజేపీ నాయకులు



నవతెలంగాణ-మర్కుక్

మెదక్ పార్లమెంటులో బిజెపి అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు బారీ మెజారిటీతో గెలుపు ఖాయమని మర్కుక్ మండల బీజేపీ అధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి అన్నారు.గురువారం ఆయన అధ్వర్యంలో మర్కుక్ నుండి బిజెపి నాయకులు మెదక్ లో నామినేషన్ కోసం ర్యాలికి బయలుదేరారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు సింగం సత్తయ్య,ఉపాధ్యక్షులు తాడురి మహేష్ గౌడ్,బీసీ మోర్చ అధ్యక్షులు శ్రీనివాస్,మాజీ అధ్యక్షులు రమేష్ గుప్త,ప్రధాన కార్యదర్శి రాజేందర్ సింగ్,సుర్వీ కష్ణమూర్తి, కుంట సత్యం,చంద్రం,సంజీవ్ రెడ్డి లింగ భాస్కర్,వుట్ల ఆంజనేయులు,ఓబీసీ నాయకులు సత్యనారాయణ,శ్రీను,దాస్,శ్రీకాంత్ రెడ్డి, బిజెవైఎం నాయకులు పంజా మధు, మహేందర్,కొండ బాలు,నగేష్, మైసిగారి బాలకృష్ణ, శ్రీపాల్ రెడ్డి,నాయకులు ,తదితరులున్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల గెలుపు ఖాయం



నవతెలంగాణ-మర్కుక్

మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నీలం మధును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యువజన కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు గుర్రాల నర్సింలు అన్నారు.గురువారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థుల గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ఆరు గ్యారెంటీ ల పథకాల అమలు తీరు, ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. మెదక్ పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు గెలుపు కోసం తనవంతుగా కృషి చేస్తానన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని చేబర్తి గ్రామానికి పోయిల నర్సమ్మ (90) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. గురువారం మృతురాలు కుటుంబాన్ని మర్కుక్ జడ్పీటీసీ యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్ పరామర్శించి, మతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తాజా మాజీ సర్పంచ్ ఎర్రబాగు ఆశోక్, ఉపసర్పంచ్ స్వామి, రైతు బంధు సమితి అధ్యక్షులు జాలని బాలనర్సయ్య, అత్మకమిటీ డైరెక్టర్ బబ్బూరి రాములు గౌడ్,బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు గ్యారా మల్లేశం, నాయకులు జయరాం, మల్లేశం తదితరులున్నారు.

మృతుని కుటుంబానికి ఉద్యోగం కల్పించాలి

నవతెలంగాణ - హుస్నాబాద్ రూరల్



ఇటీవల హుస్నాబాద్ పట్టణంలో వడదెబ్బతో మృతి చెందిన పోస్ట్ మెన్ ఎల్లయ్య కుటుంబంలో అర్హులైన వారికి ఉద్యోగ అవకాశము కల్పించాలని బి సి సంక్షేమ సంఘం నాయకులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్, బీఎస్పీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలగందుల శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఎల్లయ్య కుటుంబాన్ని పరామర్శించారు. ఎల్లయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బి ఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గం అధ్యక్షులు వేల్పుల శంకర్, బిఎస్పి పార్టీ సీనియర్ నాయకులు ఎడెల్లి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

నీలం మధు విజయానికి కృషి చేయాలి



టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ తీన్మార్ మల్లన్న

నవతెలంగాణ-జగదేవపూర్

మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి, బహుజన బిడ్డ నీలం మధు గెలుపుకు సైనికులుగా పనిచేయాలని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ తీన్మార్ మల్లన్న కోరారు. గురువారం జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ యూత్ నాయకులు ఉప్పల ప్రవీణ్ గుప్త, నితీష్ రెడ్డి, మహేందర్ రెడ్డి, ప్రవీణ్, కరుణకర్ రెడ్డి లు హైదరాబాదులో తీన్మార్ మల్లన్నను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ లోకసభ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ విజయం సాధించడం ఖాయమని, యూత్ నాయకులంతా కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని సూచించారు.

బహుజన ప్రజా సంఘాల సమైక్య సమావేశం



నవ తెలంగాణ - సిద్దిపేట

బహుజన ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, కార్మిక, కర్షక ప్రజల సమస్యలపై సమావేశంలో చర్చించడం జరిగిందని, సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమాలు అవసరమని బహుజన ప్రజాసంఘాల జిల్లా నాయకులు కొమ్ము దుర్గారాములు, దబ్బేట ఆనంద్ అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజల స్థానిక సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించామని, అదేవిధంగా బహుజన మహసభ వేదికలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంఘ నిర్మాణంలో భాగంగా ముస్లిం మైనార్టీ జిల్లా కమిటీ వేసినట్లు తెలిపారు. నూతనంగా ఎం హెచ్ పి ఎస్ జిల్లా బాధ్యులుగా నియమించబడ్డ కన్వీనర్, కో కన్వీనర్ షేక్ దస్తగిరి, ఎస్కే సల్మాన్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే సమకాలికురాలైన ఫాతిమా షేక్, షహీద్ అశ్వతుల్లా ఖాన్, సోయా ఉల్లా ఖాన్ ల స్ఫూర్తితో పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి చాంద్, ఎస్.కె ఇస్మాయిల్, గఫర్, యాకూబ్, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగు పై క్షేత్ర ప్రదర్శన



నవతెలంగాణ-మర్కుక్

వరిలో వేద సాగువలన రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గడంతో పాటు సరైన సమయంలో విత్తనం వేసుకోవడానికి అనుకూలంగా ఉంటుందని, సాధారణ పద్ధతితో పోలిస్తే దిగుబడి కూడా 2 నుంచి 3 క్వింటాలు ఎక్కువగా వస్తుందని మండల వ్యవసాయ అధికారి డా.టి. నాగేందర్ రెడ్డి సూచించారు.గురువారం మండలంలోని ఎర్రవల్లి గ్రామంలో వేద సాగు, ఆయిల్ పామ్ తోటలో సిద్దిపేట జిల్లా డీలర్లకు క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేదసాగులో పంటకాలం 7 నుంచి 10 రోజులు తగ్గుతుందన్నారు. ఆయిల్ ఫామ్ పంట సాగులో ఒక ఎకరా వరి సాగుకు అవసరమైన నీటితో 4 ఎకరాల పామాయిల్ పంటను సాగు చేయవచ్చన్నారు. రైతులు నీటి యాజమాన్యం ఎరువుల యాజమాన్యం , పురుగుల యాజమాన్యంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. వాతావరణాన్ని బట్టి మొక్కల పాదులలో తగినంత తేమ ఉండేలా నీరు అందించాలని సూచనలు చేశారు. ఆయిల్ పామ్ మొక్కలు నాటిన 14 నెలల నుండి పూతకు వస్తాయని మొక్క తొలి దశలో వేరు వ్యవస్థ బాగా అభివృద్ధి చెంది నీరు పోషకాలు గ్రహించి చెట్టు బాగా పెరగాలంటే ఈ పూలగుతులను వెంటనే తుంచివేయాలని సూచించారు. ఆయిల్ పామ్ తోటలో మొక్కల మధ్య దూరం ఎక్కువ కనుక తొలి 3 సంవత్సరాల కాలంలో అంతర పంటలు పండించి రైతులు ఆదాయం పొందవచ్చున్నారు. 8 సంవత్సరాల తరువాత కోకో ,మిరియాలు వంటి అంతర్ పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో దేశీ కో ఆర్డినేటర్ శంకర్ రావు , విజయ్, వ్యవసాయ విస్తరణ అధికారులు రజనీకాంత్ మరియు విష్ణువర్ధన్, రైతులు , డీలర్లు ,తదితరులున్నారు..

మున్నూరు కాపులను రాజకీయంగా ప్రోత్సహించండి

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు దాక్టర్ఆకుల నరేష్ బాబు



నవతెలంగాణ- గజ్వేల్

మున్నూరు కాపులను రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వాలు ప్రోత్సహించాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకులు ఆకుల నరేష్ బాబు అన్నారు. గురువారం గజ్వేల్ మండలం బెజగామ గ్రామంలో గజ్వేల్ మండలం మున్నూరు కాపు సంఘం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయంగా ఆర్థికంగా మున్నూరు కాపులు సంఘటితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. పేద మున్నూరు కాపులను ఆదుకోవాలని ఆయన కోరారు. రాష్ట్ర సంఘం ఇప్పటికే పేద పేదలను, పేద విద్యార్థులను ఆదుకొని అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు మారుతున్న మున్నూరు కాపు సంఘానికి కార్పొరేషన్ ఏర్పాటు చేసిన నిధులు ఇవ్వలేదని ఆయన అన్నారు. ప్రత్యేక దృష్టి పెట్టి కార్పొరేషన్ నిధులు మంజూరు చేయాలని ఆయన కోరారు. మున్నూరు కాపు సంఘం నాయకులు చందా నర్సింలు, బండ్ల స్వామి, గంగిశెట్టి నరసింహులు, బాదే నర్సింహులు, శ్యాం కుమార్, ఆకుల శ్రీనివాస్, పో రెడ్డి శ్రీనివాస్, సత్యనారాయణ, బాలయ్య, భూమయ్య, ముత్తయ్య, నర్సింలు, ఆకుల యాదగిరి, దేవేందర్, వెంకటేశం, నాగభూషణం, కృష్ణ, నరేష్, విజయ్ కుమార్, నవీన్ కుమార్, వెంకటేష్, శివకుమార్, భువన చందర్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సేవలు మరింత విస్తృతపరచాలి

చలివేంద్రం ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్

వాసవి క్లబ్ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ వారి ఆధ్వర్యంలో కీర్తి శేషులు గంగిశెట్టి రాజేశం పోచమ్మ జ్ఞాపకార్థం ప్రజ్ఞాపూర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశారు. గురువారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంటా నర్సారెడ్డి,కిరాణా అసోసియేషన్ అధ్యక్షులు సిద్ది బిక్షపతి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన వాసవి క్లబ్ వారిని అభినందించారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. అలాగే వాసవి క్లబ్ అధ్యక్షులు జగ్గయ్య గారి శేఖర్, ప్రధాన కార్యదర్శి సిద్ది నవీన్,గంగిశెట్టి వెంకటేశం,బాలయ్య, ఆంజనేయులు ,భాస్కర్, సంతోష్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. వాసవి క్లబ్ సభ్యులు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు మోహన్న గారి రాజు,ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, రమేష్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి,ఆర్యవైశ్యులు నంగునూరి సత్యనారాయణ, అత్తెల్లి లక్ష్మయ్య,సూర ఆంజనేయులు, కైలాస ప్రభాకర్, కాశీనాథ్,సంతోష్,రవీందర్, కైలాస ప్రశాంత్ , చంద నాగభూషణం ,ఆర్యవైశ్య నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణ పట్ల ప్రజలను చైతన్యం చేయాలి

జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాస్



నవ తెలంగాణ - సిద్దిపేట

ఆరోగ్యకేంద్రానికి వచ్చిన 30 ఏండ్ల వయస్సు పైబడిన వారందరికీ స్క్రీనింగ్ (అసంక్రమిత వ్యాధుల) నిర్వహించాలని, ప్రజల్లో కుటుంబ నియంత్రణపైన, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలపైన, అంటువ్యాధులపైన అవగాహన కల్పించాలని, వ్యాధుల నియంత్రణ పట్ల చైతన్యం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ తెలిపారు. గురువారం పట్టణంలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కార్యక్రమాల పనితీరును పరిశీలించారు, అనంతరం సిబ్బందిని ప్రజలకు అందుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన ఆరోగ్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి కొన్ని సూచనలు చేయడం జరిగింది. ఎండ తీవ్రతను దష్టిలో పెట్టుకొని ఓఆర్ఎస్ పాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, అత్యవసర సమయంలో ఉపయోగించే మందులను ఎప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని, గర్భిణీ స్త్రీ నమోదు దగ్గర నుంచి ప్రసవం ఆయన తర్వాత శిశువు, తల్లికిసంరక్షణ చర్యలు చేపట్టాలనీ, వృద్ధుల ఆరోగ్యం పట్ల, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ తనిఖీలో వైద్యాధికారి డాక్టర్ సాయికిరణ్, జిఎన్ఎమ్ గాలమ్మ, సరిత, సంగీత, బిక్షపతి, రమేష్ నవీన్ , ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంటకు బోనస్ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డ్



నవతెలంగాణ -నంగునూరు

వరి పంటకు రూ.500 బోనస్ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డ్ ద్వారా వినూత్న నిరసన తెలిపారు. గురువారం నంగునూరు మండలం రాంపూర్, మగ్దుంపూర్ గ్రామాల్లోని రైతులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మద్దతు ధరతో పాటు రూ.500ల బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు నంగునూరు మండల బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆనగోని లింగం గౌడ్‌లు మాట్లాడుతూ రైతు బంధు డబ్బులు అందరికీ ఇవ్వాలని, రుణమాఫీ వెంటనే ప్రకటించాలని కోరారు.అదేవిధంగా రైతు భరోసా రూ.10,000 బదులు రూ.15,000, రైతు కూలీలకు ఇస్తానన్న రూ.12,000, వర్షాలు రాక ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఎంపీ ఎన్నికల్లో ఓటుతో గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బీఆర్ఎస్ నాయకులు ఆనగోని పర్శరాములు గౌడ్, మయోజు చక్రపాణి, రంజిత్ రెడ్డి, రైతులు తదితరులు హాజరైనారు.

వాయునందన వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-చేర్యాల

మండల కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీ వాయునందన వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీతారాముల కళ్యాణంలో పోసిన బియ్యాన్ని గురువారం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు మంచాల కొండయ్య, అంబటి సిద్ధయ్య గౌడ్, కొరుకొప్పుల మదుసాగర్ గౌడ్,ఇలిటం పెంటయ్య గౌడ్, తేరాల రాజు, జమలాపురం రమేష్, వెంకటేష్ , బూరుగు సత్యనారాయణ, ఏ.బిక్షపతి, కె.సిద్దుగౌడ్ పి.రాజేష్ , బి.మురళి,అల్లాడి జగదేశ్వరరావు, కాంగ్రెస్ చేర్యాల పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, అంబటి అంజయ్యగౌడ్ తో పాటు భక్తులు పాల్గొన్నారు.

మల్లన్న సాగర్ ముంపు గ్రామ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిక



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ పట్టణ పరిధిలో మల్లన్న సాగర్ ముంపు గ్రామం ఆర్ అండ్ ఆర్ కాలనీ లక్ష్మాపూర్ బీజేపీ నుంచి స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తిగుల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో గురువారం చేరారు. డిసిసి అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి గ్రామ ప్రజలను పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ.. ఈసారి కాంగ్రెస్ పార్టీ ఎంపీ ఎన్నికల్లో మెదక్ పార్లమెంటు స్థానం పై విజయకేతనం ఎగరడం ఖాయం అని తెలిపారు. కెసిఆర్ కనీసం ఆర్ అండ్ ఆర్ కాలనీ ప్రజల సమస్యల పరిష్కారానికి ఒక్కసారైనా ప్రజలను కలిసిన దాఖలాలు లేవన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ లక్ష్మాపూర్ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉండి బాధితులకు న్యాయం జరిగేలా చేస్తానని తెలిపారు. ఆర్ అండ్ ఆర్ కాలనీ లక్ష్మాపూర్ నుండి చేరిన వారు ధర్మ రెడ్డి, మల్లేశం, కిష్టయ్య, నాగులు, సత్తయ్య, రాజు, కరుణాకర్, యాదగిరి ఉన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ రాజు రెడ్డి, నరసింహారెడ్డి, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

నీలం మధుకు ఓటేద్దాం



నవతెలంగాణ- సిద్దిపేట రూరల్

నీలం మధుకు ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపిద్దామని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి అన్నారు. గురువారం నారాయణరావుపేట మండలంలోని జక్కాపూర్ గ్రామంలో మహిళలు, వివిధ పార్టీలకు సంబంధించిన సుమారు 40 మందికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ ఆదేశాల మేరకు జక్కాపూర్ మహిళలు పార్టీలోకి ఆహ్వానించారు. సిద్దిపేట నియోజకవర్గంలో రోజురోజుకు భారీగా చేరికాలతో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేటలో బలంగా తయారవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో మహిళలకు సముచిత స్థానాన్ని అందించడంలో కాంగ్రెస్ పార్టీ ముందుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే మహిళల అభ్యున్నతికై ఉచిత ఆర్టీసీ బస్ సౌకర్యం, 500కే వంట గ్యాస్, ఇందిరమ్మ ఇండ్లు లాంటి అనేక పథకాలను మహిళలను కేంద్రంగా చేసుకుని ప్రవేశపెట్టినవేనన్నారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికలు పెత్తందారులకు, పేదోడికి మధ్య జరుగుతున్న సమరమన్నారు. ఈ పోరాటంలో సామాన్య ప్రజలంతా పేదోడి పక్షాన నిలబడి నీలం మధును గెలిపిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చింతల రాజ్ వీర్, ఉపాధ్యక్షులు రేణుక, ప్రధాన కార్యదర్శి మంద వనజ, సీనియర్ నాయకులు అశోక్, పర్శరాములు, బాలయ్య, రాజు, నక్క కాంతయ్య, శ్రీనివాస్, వేణు, ఉమ, కనకవ్వ పాల్గొన్నారు..

నీలం మధు ముదిరాజ్ గెలిపించాలి



నవతెలంగాణ -నంగునూరు

పేద బడుగు వర్గాల నుంచి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ గెలిపించాలని సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ, మెదక్ లోకసభ, సిద్దిపేట నియోజకవర్గ ఎన్నికల ఇంచార్జి మక్సూద్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరిలు కోరారు. గురువారం నంగునూరు మండలం సిద్దన్నపేట గ్రామ శ్రేష్ఠ ఫంక్షన్ హాల్‌లో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు తప్పెట శంకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తూచా తప్పకుండా అమలు చేస్తుందని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మచ్చలేని నాయకుడు నీలం మధు ముదిరాజ్ భారీ మెజారిటీతో గెలపించాల్సిన బాధ్యతలను ప్రతి ఒక్కరూ తీసుకుని విస్తృతంగా కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ నుంచి పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు అచ్చిన సత్తయ్య, ఎనగందుల యాదగిరి, బాగు శ్రీకాంత్, జంగిటి శ్రీనివాస్, చెలికాని యాదగిరి, రాగుల కృష్ణా,అనరాజు నాగరాజు, జహీదా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి నామినేషన్ మద్దతుగా తరలి వెళ్లిన నాయకులు



నవతెలంగాణ-తొగుట

మెదక్ కలెక్టర్ కార్యాలయంలో మాధవనేని రఘు నందన్ రావు మొదటి విడత నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా మద్దతుగా తరలి వెళ్లామని చందాపూర్ మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింలు, ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు కంకణాల నరసింహులు తెలిపారు. జరగబోయే పార్లమెంట్ ఎన్ని కలలో మెదక్ గడ్డపైన కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల డిపాజిట్లు గల్లంతవడం ఖాయమన్నారు. దొరల పాలన పోయి ప్రజలను దోచుకునే పాలన వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలోకి వచ్చి 100 రోజులు దాటినా ఇప్పటి వరకు తాము ఇచ్చిన 6 గ్యారంటీలను పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. కావున మెదక్ ప్రజలు ఈ ఇరు పార్టీలకు చెంపపెట్టుగా బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఐలిగొండ చంద్రశేఖర్ గౌడ్, సిలివేరి నరేష్ గౌడ్,వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు అక్కరాజు ఆంజనేయులు, గొడుగు కరుణాకర్, మాదారం ప్రవీణ్, నాయకులు బిక్కునూరి బాలరాజు, అక్కరాజు భూమయ్య, బిక్కునూరి అనిల్, అబ్బన బోయిన మల్లయ్య, మోతే స్వామి, రంజిత్, అనిల్, మోహన్, శ్రీకాంత్, పోతరాజు శంకర్, అజయ్ ముదిరాజ్, రమేష్, మనోహర్ పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో దేవాలయాల పునర్నిర్మాణం చేసుకోవాలి



నవతెలంగాణ- గజ్వేల్

ప్రతి గ్రామంలో పురాణత దేవాలయాలు శిథిలావస్థకు చేరాయని వాటిని పునర్నిర్మాణం చేసుకోవాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడి పల్లి భాస్కర్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని ముట్రాజ్ పల్లి లో దుర్గమ్మ గుడిని నూతనంగా నిర్మిస్తున్నట్లు గ్రామానికి చెందిన కృష్ణ, భాను ప్రసాద్, తన దృష్టికి తీసుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. దీంతో గుడి నిర్మాణానికి పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో నూతన దేవాలయాలతో పాటు సామాజిక వర్గాలుగా ప్రస్తుతం దేవాలయాలను నిర్మించుకుంటున్నారని పురాణత దేవాలయం కూడా పునర్నిర్మాణం చేసుకోవాలని ఆయన సూచించారు. గతంలోనే గజ్వేల్ లో ఉమామహేశ్వర దేవాలయం, మాంకాలమ్మ దేవాలయ పునర్నిర్మాణం చేపట్టినట్లు ఆయన గుర్తు చేశారు. ఇది ఇలా ఉండగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు వస్తున్న ప్రచారంపై నవ తెలంగాణ ఆయన దృష్టికి తీసుకపోగా వాస్తవమేనని ఆయన తెలిపారు.